క్లుప్తంగా

వనప్రేమికుడికి సన్మానం



వన ప్రేమికుడు సాంబయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఏన్కూరు: పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాటర్‌షెడ్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో వనప్రేమికుడు కొంటు సాంబయ్యకు బుధవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు జెస్సీ సునీత, కె.వినోద్, డి.శ్రీనినివాస్, ముఖేష్, యుగందర్, వ్యవసాయాధికారి నర్సింహారావు, సంస్థ ప్రతినిదులు ఈశ్వర్, నాగరాజు, రవీందర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. బుధవారం మండలంలోని వందనం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ కేఎస్ కృష్ణారావు, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి

సత్తుపల్లిటౌన్: శిథిలావస్థలో ఉన్న సత్తుపల్లి బీసీ హాస్టల్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక బీసీ హాస్టల్‌ను సందర్శించి మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమౌతున్నందున హాస్టల్ భవనం అధ్వాన్నంగా ఉన్నందున వెంటనే నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నవీన్, వినోద్, నరేందర్, మున్నాఫ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ముదిగొండ: మండలంలోని వల్లాపురంలో ఇండియన్‌రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు హరినాథ్‌బాబు, నరసింహారావులు దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గ్రామంలో మొక్కలు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్‌రెడ్‌క్రాస్‌సంస్థ ఖమ్మం బ్రాంచ్ చైర్మన్ డాక్టర్‌వెలిగేటి చంద్రమోహన్, కార్యదర్శి సూర్యప్రకాష్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు జనార్దన్‌రావు, కోశాధికారి గోవర్ధన్‌రావు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ముదిగొండ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22, 23తేదీల్లో పార్టీ కార్యకర్తలకు రాజకీయశిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకుడు వాసరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు మంకెన దామోదర్, ఇరుకు నాగేశ్వరరావు, కల్యాణ్, భద్రయ్య, వెంకయ్య, ఉపేందర్, బాస్కర్‌రావు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి పార్థివదేహం

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడేనికి చెందిన చీకటి రామారావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సప్తపది లయన్స్ క్లబ్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు పార్థివదేహ దానంపై అవగాహన కల్పించి రామారావు దేహాన్ని ఖమ్మం మమత ఆస్పత్రికి దానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎస్‌కె అబ్దుల్ సలాం, జయరాం, సాంబశివరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య మృతి పార్టీకి తీరని లోటు

కొణిజర్ల: తనికెళ్లకు చెందిన సీపీఐ పార్టీ సీనియర్ కార్యకర్త జరబల గోపయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. బుధవారం తనికెళ్లలో గోపయ్య సంస్మరణ సభ నిర్వహించగా.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యర్రా బాబు, రావు, విష్ణుమూర్తి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ

ఏన్కూరు/ఎర్రుపాలెం: కేంద్రంలో ఎన్డీ కూటమి ఘన విజయం సాధించి 3వ సారి ప్రధానిమంత్రి కాబోతున్న నరేంద్రమోదీకి శుభాకాంక్షలు తెలుపుతూ.. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏన్కూరు ప్రధాన సెంటర్‌లో బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావు, నాయకులు కోటేశ్వరరావు, రవి, నల్లమోతుల రమేష్, మోరబోయిన కృష్ణ, దేవిశెట్టి వెంకట కృష్ణారావు, వరదబోయిన సత్యనారాయణ, వీరభద్రం, బానోత్ కిషన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జలకాలాటలతో..



ఈత కొడుతున్న దృశ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి(ఫైల్)



లైఫ్ జాకెట్లతో ఈత కొడుతున్న చిన్నారులు



స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారుల సందడి..

స్విమ్మింగ్ పూల్‌లో కూల్ కూల్‌గా..

- ఈతపై ఆసక్తి చూపుతున్న పిల్లలు
- వేసవి ఉపశమనం కోసం పెద్దలు..

సత్తుపల్లిటౌన్: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు ఈతకొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, బావులు, కాలువలు వద్ద ఈత కొట్టేవారితో సందడిగా ఉంటోంది. పట్టణాల్లో స్విమ్మింగ్‌పూల్ వద్దకు చిన్నారులతో పాటు పెద్దలు కూడా ఉపశమనం కోసం క్యూ కడుతున్నారు. పనిలో పనిగా చిన్నారులకు తల్లిదండ్రులు ఈత నేర్పిస్తున్నారు. ఈత ఆరోగ్యానికి కూడా మేలు కావటంతో సత్తుపల్లిలోని స్విమ్మింగ్‌పూల్‌కు ఆదరణ లభిస్తుంది. స్థానిక డాల్ఫిన్ స్విమ్మింగ్‌పూల్ వద్ద కోచ్ పర్యవేక్షణలో చిన్నారుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొంటోంది.

ఉల్లాసం.. వ్యాయామం..

వేసవిలో వయస్సుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్ద ఈత కొట్టేందుకు ప్రాధాన్యత ఇస్తారు. అందుకే స్విమ్మింగ్‌పూల్స్‌లో చిన్నారులకు విడిగా తక్కువ లోతు, యువకులు, పెద్దల కోసం మూడు నుంచి ఏడు అడుగులు లోతు ఉన్నవి ఏర్పాటు చేస్తారు. రోజు గంట పాటు ఈత కొడితే శ్వాస ప్రక్రియ మెరుగుపడటంతో పాటు శరీరంలోని కొవ్వు, క్యాలరీలు కరుగుతాయని వైద్యులు చెపుతున్నారు. ఈత కొట్టడంతో 90శాతం అవయవాలు కదలటం వల్ల మంచి వ్యాయామం చేసినట్లు అవుతుందని, మెదడు పనితీరుతో పాటు జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని సూచిస్తున్నారు. మానసిక ఉల్లాసం లభిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఈత నేర్చుకునేటప్పుడు లైఫ్ జాకెట్లు, తలకు వాటర్ ప్రూఫ్ క్యాప్, కళ్లకు అద్దాలు, చెరువుల్లోకి నీరు వెళ్లకుండా అమర్చే పరికరాలతో పాటు సేఫ్టీ పరికరాలు వినియోగించాలి.
- శిక్షకుల పర్యవేక్షణ ఉండాలి.
- చెరువులు, కుంటలు, కాలువల్లో లోతైన ప్రదేశాలకు వెళ్లొద్దు.. తలకు టోపీ, కళ్లకు అద్దాలు ధరించటం మంచిది.
- చర్మవ్యాధులు, జలుబు ఉన్నవారు స్విమ్మింగ్ పూల్‌లోకి వెళ్లకూడదు.
- స్విమ్మింగ్‌లో నుంచి బయటకు రాగానే స్నానం చేస్తే చర్మసమస్యలు వచ్చే అవకాశం ఉండదు.
- స్విమ్మింగ్ పూల్‌లో చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.
- ఎప్పటికప్పుడు నీటిని మార్చాలి.

ప్రయోజనాలు..

రక్తపోటు, మధుమేహం, గుండెసంబంధిత వ్యాధులు ఉన్న వారు ఉపశమనం పొందవచ్చు. ఈత కొట్టడం వల్ల ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పుల నుంచి విముక్తి లభిస్తుంది. జ్ఞాపకశక్తి, చురుకుదనం పెరుగుదలకు దోహదపడుతుంది. ఈత ఒత్తిడిని దూరం చేస్తుంది. అన్ని అవయవాలకు సంపూర్ణ వ్యాయామం లభిస్తుంది.

అనేక బహుమతులు సాధించా..



మొదట్లో నాకు నీళ్ల భయం ఎక్కువగా ఉండేది. స్విమ్మింగ్ పూల్‌లో దించితే భయంతో ఏదో ఒక వంకతో బయటకు పరుగెత్తేవాడిని. తర్వాత దాని నుంచి బయటపడి ఈతతో నైపుణ్యం సాధించా. ఫ్రెంట్, బ్యాక్, అండర్‌గ్రౌండ్ తదితర రకాల స్విమ్మింగ్ నేర్చుకున్నా. సత్తుపల్లి, కొత్తగూడెం, హైద్రాబాద్, ఖమ్మంల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో అనేక బహుమతులు సాధించాను.

– సాత్విక్, 7వ తరగతి, సత్తుపల్లి

ఈత నా హాబీ..



స్విమ్మింగ్ నా హాబీ.. ఏ మాత్రం విరామం దొరికినా ఎక్కువ సేపు స్విమ్మింగ్ చేస్తాను. ఎండా, వాన, చలి అని ఉండదు. క్రమం తప్పకుండా పూల్‌కు వెళ్తాను. స్విమ్మింగ్ చేయటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుంది.

– సునీల్, ఎస్టీఓ, సత్తుపల్లి

నీట్ ఫలితాల్లో 'లిటిల్ ఫ్లవర్స్' ప్రతిభ

వైరా: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాల్లో వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేష్ తెలిపారు. కళాశాలకు చెందిన ఎక్కిరాల కీర్తి జాతీయ స్థాయిలో 2,061, గుడిపూడి ఉదయ భాస్కర్ 4,364, ఉండ్రు అజయ్‌బాబు 21,270వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. కాగా, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు బుధవారం కరస్పాండెంట్‌తో కలిసి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కలవగా ఆయన అభినందించారు. డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైరా విద్యార్థికి 595 మార్కులు..



బొంతు భగత్

నీట్‌లో వైరాకు చెందిన బొంతు భగత్ 720 మార్కులకు గాను 595 మార్కులతో జాతీయ స్థాయి ర్యాంకు సాధించాడు. మాజీ ఎంపీపీ బొంతు సమత – రాంబాబు దంపతుల కుమారుడైన భగత్ పదో తరగతి వరకు మధు విద్యాలయంలో, ఇంటర్ హైదరాబాద్‌లో చదవగా ఆయనను పలువురు అభినందించారు.

మధిర విద్యార్థి సత్తా..



దారా పృథ్వీతేజ

మధిరరూరల్: మధిర మండలం ఆత్కూరుకు చెందిన దారా పృథ్వీతేజ నీట్‌లో ప్రతిభ చాటాడు. ఆయన 560 మార్కులతో జాతీయ స్థాయిలో 60,019 ర్యాంకు సాధించాడు. మధిరలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన పృథ్వీ ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తిచేశాడు. కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడైన బాలరాజు కుమారుడు పృథ్వీకి పలువురు అభినందనలు తెలిపారు.

అన్నింటా కాంగ్రెస్‌దే ఆధిక్యం

- 2019లో ఎంపీ నామకు 7,860 మెజార్టీ
- ప్రస్తుత అభ్యర్థి రఘురామరెడ్డి 61,778..
- వైరా మున్సిపాలిటీలో కూడా మెజార్టీ కాంగ్రెస్‌దే

నియోజకవర్గంలో మెజార్టీ వివరాలిలా..

మండలం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ	మెజార్టీ
వైరా	21,573	7,733	2,240	13,840
కొణిజర్ల	26,431	9,746	3,203	16,685
ఏన్కూరు	14,364	5,294	1,708	9,070
జూలూరుపాడు	13,089	6,296	1,716	6,793
కారేపల్లి	22,823	7,433	2,939	15,390
మొత్తం	98,280	36,502	11,806	61,778

వైరా: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో వార్ వన్‌సైడ్ అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పోలయ్యాయి. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఎంపీ అభ్యర్థికి దాదాపు రెట్టింపు మెజార్టీ వచ్చింది. ప్రతి మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి ఆధిక్యాన్ని ప్రదర్శించారు. వైరా నియోజకవర్గంలో 18రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 98,280 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి నామకు 36,502 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు 11,806 ఓట్లు లభించాయి.

వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్‌దే పై చేయి..

వైరా మున్సిపాలిటీ పరిధిలో వైరాతో పాటుగా కొణిజర్ల మండలం దిద్దుపూడి, పల్లిపాడు, లాలాపురం, శాంతినగర్‌తో పాటుగా సోమవరం గండగలపాడు, బ్రాహ్మణపల్లి పరిధిలో 20 వార్డులు ఉండగా 32 పోలింగ్ బూతులున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు 11,687 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌కు 6,558 ఓట్లు లభించాయి. రాందాస్ నాయక్‌కు 5,129 ఓట్లు మెజార్టీ లభించింది. అసెంబ్లీ ఎన్నికలలో కొనసాగిన కాంగ్రెస్ హవా, పార్లమెంట్ ఎన్నికలలో కూడా కొనసాగింది. మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ 11,485 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థికి 3,923 ఓట్లు లభించాయి. బీజేపీకి కేవలం 1,386 ఓట్లు మాత్రమే లభించాయి, కాంగ్రెస్ అభ్యర్థికి 7,569 ఓట్లు మెజార్టీ లభించింది. అసెంబ్లీ ఎన్నికలలో నియోజకవర్గంలోని 5 మండలాల్లో అక్కడక్కడా బీఆర్ఎస్ పార్టీ కొన్ని పోలింగ్ బూత్‌ల్లో మెజార్టీ సాధించినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పూర్తి అధిపత్యాన్ని కొనసాగించారు.

మా పనితీరుకు నిదర్శనమే మెజార్టీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ఆరు నెలల పనితీరును చూసి ఓటు వేయాలని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పిలుపునివ్వగా పరిపాలన నచ్చడంతో కాంగ్రెస్ అభ్యర్థికి నియోజకవర్గ ప్రజలు 70వేల మెజార్టీ ఇచ్చారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వెల్లడించారు. ఈమేరకు ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయ్యాయని, మంత్రుల సహకారంతో త్వరలోనే పనులను వేగవంతం చేస్తామన్నారు. ఇక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని సూచించారు.

వారిని పక్కన పెట్టడంతోనే..

లోక్‌సభ ఎన్నికల్లో ఇంటి దొంగలను పక్కన పెట్టడం, కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలతో సమష్టిగా పని చేయడం వల్ల మంచి ఆదరణ లభించిందని, ఇది ప్రజల విజయమని దయానంద్ అన్నారు. సత్తుపల్లిలో కాంగ్రెస్ ఒకటే గ్రూపు అని, ఇక్కడ ఏ కార్యక్రమం చేపట్టాలన్నా ఎమ్మెల్యే అనుమతి తీసుకోవాలే తప్ప బయట నుంచి వచ్చి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వ్యతిరేకంగా పని చేసిన వారిని దగ్గరకు రానిచ్చేది లేదని, మాఫియా పనులు చేపట్టే వారికి పార్టీలో స్థానం లేదని, త్వరలో మున్సిపాలిటీలో అవినీతిని కడిగిపారేస్తామని చెప్పారు. కిందస్థాయి కార్యకర్తలను గ్రామ స్థాయిలోనే తీసుకునే నిర్ణయాల్లో తమ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, మందపాటి ముత్తారెడ్డి, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, కాసర్ల చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, కాపా సుధాకర్, శివవేణు, ఎం.డీ.కమల్‌పాషా, తోట సుజలరాణి, పద్మజ్యోతిరెడ్డి, పింగళి సామేలు, మోరంపూడి పాండు, నరుకుళ్ల సత్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ కట్టబెట్టారు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డికి వైరా నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు భారీ మెజార్టీని కట్ట బెట్టారని అందుకు వారందరికీ రుణపడి ఉంటానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం వైరా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి కార్యకర్తల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు దాసరి దానియేలు, కట్ల రంగారావు, గుత్తా వెంకటేశ్వరరావు, పాదిల హరినాథ్, బొళ్ల గంగారావు, నరసింహారావు, అశోక్, వెంకటేశ్వరరావు, ఆనందరావు, కొండలు, శ్రీను,రామారావు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి



మధిర: మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

మధిర/ఎర్రుపాలెం: విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని మధిర డివిజన్ వ్యవసాయ అధికారి కొంగర వెంకటేశ్వరరావు, మధిర, ఎర్రుపాలెం మండల వ్యవసాయ అధికారులు డీఎన్‌కే శ్రీనివాసరావు, కె.విజయ భాస్కర్‌రెడ్డి, మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మధిర, ఎర్రుపాలెం రైతు వేదికల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ డీలర్ లైసెన్స్ కలిగి ఉండాలని, విత్తనాల స్టాకు వివరాలను విధిగా బోర్డుపై నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు విధిగా రశీదులివ్వాలని, రైతులు కూడా పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు. ఎరువులను, విత్తనాలను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విత్తనాల ధరలను ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దుకాణాన్ని, గోడౌన్‌ను మార్చేటప్పుడు డోర్ నంబర్ కూడా మార్చాలని, లైసెన్స్ సర్టిఫికెట్‌లో మారిన నంబర్‌ను కూడా నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో పత్తి విత్తనాలకు విక్రయానికి ఎవరైనా దళారులు వస్తే తమకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ గోపాలరావు, ఏఈఓలు ధాత్రి, బాలకృష్ణ, జిష్ణు, శ్రీకాంత్, కృష్ణకుమారి, సుష్మ, దుర్గా ప్రసన్న, తదితరులున్నారు.

సరిపడా విత్తనాలు అందించాలి



ఏఓ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న రైతులందరికీ సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏఓ పవన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. రైతులకు 2,200 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరం కాగా కేవలం 800 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేశారన్నారు. తక్షణమే రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లెంపాటి రామారావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, పైడిపల్లి సాంబశివరావు, బెజవాడ వీరభద్రం, కొంగర నాగేశ్వరరావు, సుధాకర్, నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలో పచ్చిరొట్ట ఎరువులైన జిలుగు విత్తనాలను చల్లే విధివిధానాలపై బుధవారం ఏడీఏ కరుణశ్రీ, ఏఓ ఎస్.పవన్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కొనుగోలు చేస్తున్న జిలుగు బ్యాగులను రైతులు సక్రమంగా వినియోగిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులైన జిలుగు విత్తనాలను పొలాల్లో చల్లుకోని భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు ఏఈఓలు నర్సయ్య, రాజేష్, రైతులు బండి నాగేశ్వరరావు, కాంపెల్లి సైదులు, వాసు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ముదిగొండ: మండలంలోని వనవారికిష్టాపురం, కమలాపురం గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో వ్యవసాయాధికారిణి రాధ బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తన నిల్వలు, ఎరువులు, రికార్డులను ఆమె పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సత్తుపల్లిటౌన్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సత్తుపల్లి 6వ అదనపు జిల్లాజడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ మీరా ఖాసీం సాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వడ్డి లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తేళ్లూరి ఆడమ్స్, న్యాయవాదులు షేక్ బుజ్జీ సాహెబ్, కృష్ణప్రసాద్, సెక్రటరీ రమేష్, వెంకటకృష్ణ, సుదర్శనం, సాంబశివరావు, కోర్టు సూపరింటెండెంట్ బోయినపల్లి రవి, కోర్టు కానిస్టేబుల్ గిరి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్, తదితరులు

సత్తుపల్లి అర్బన్‌పార్కులో..



మొక్కకు నీళ్లు పోస్తున్న ఎఫ్‌డీఓ మంజుల పక్కన రేంజర్ స్నేహలత, అధికారులు

సత్తుపల్లి అర్బన్‌పార్కులో సత్తుపల్లి డివిజనల్ ఫారెస్ట్ అధికారి వాడపల్లి మంజుల మొక్కలు నాటారు. ముందుగా డివిజనల్ కార్యాలయం ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు అటవీశాఖ రేంజ్‌లోని అధికారులు, సిబ్బందితో కలిసి శ్రమదానం నిర్వహించారు. పర్యావరణ ఆవశ్యకతపై బ్రహ్మకుమారి రాధిక వివరించి పుస్తకాలు అందించారు. ఎఫ్‌డీఓ మంజులకు జ్ఞాపిక అందించి సత్కరించారు. రేంజర్ స్నేహలత, డీఆర్ఓ ముత్యాలరావు, నసరూబి, ఎఫ్ఎస్ఓలు నర్సింహా, మంగారావు, మధన్, శిల్ప, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కిష్టారం ఓసీలో..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీ కార్యాలయంలో పీఓ ఎంవీ నర్సింహారావు మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులు పర్యావరణంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఓసీ మేనేజర్ రామకృష్ణ, ఇంజనీర్ వీరప్రసాద్, బాబు, పర్యావరణ అధికారి సూర్యప్రకాష్, ఏఐటీయూసీ నాయకులు కిషోర్, ఐఎన్‌టీయూసీ నాయకులు అఫ్రోజ్, సంక్షేమాధికారి విజయ్‌సందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: కిష్టారం ఓసీలో మొక్క నాటుతున్న పీఓ ఎంవీ నర్సింహారావు

సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో..

గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ నల్లంటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అన్నివిభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో..


మధిర: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. మడుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లింగంపల్లి అప్పారావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. చెట్లు పెంపకంతోనే వాతావరణం సమతుల్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, అశోక్, లక్ష్మి, విజయమ్మ, అరుణ, నరేంద్ర కుమారి, ఏఈ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మేడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

ముదిగొండ: మొక్కలు నాటి సంరక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. మండలపరిధిలోని మేడేపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

కొణిజర్ల: కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, ఈజీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అమ్మపాలెం, చిన్నగోపతి గ్రామాల్లో పర్యావరణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చెరువుల వద్ద ప్రతిజ్ఞ చేస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తామన్ని, ప్లాస్టిక్‌కు బదులుగా భూమిలో త్వరగా కలిసి పోయే వస్తువులు వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, ఏపీఓ అమ్మాజాన్, ఈసీ సునీల్ రాజ్, ఈజీఎస్, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



కొణిజర్ల: అమ్మపాలెం చెరువు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ రాజ్, ఈజీఎస్ సిబ్బంది